# శిధిలబంధాలు

ఇక్కడ కూడా 'నీ వుండేదీకొండపై' అనుకొంటే నవ్వొచ్చింది నరసింహానికి. రేపు ఊరికెళ్ళిపోతాడు తాను. అందుకని హైదరాబాదులో ఉన్న చూడదగిన ప్రదేశాలు చూడాలని తాపత్రయం. చూసేదేముంది! ఏఊళ్ళోనూ ఏవో చూడవలసినవి ఉంటూనే ఉంటాయి. మనసు నిబ్బరంగా సంతోషంగా ఉండకుండా ఏంచూసినా ఒకటే ఏం చూడకపోయినా ఒకటే. నగరంలో ఉన్న విశేషాలు తమ్ముడి బిడ్డలు తనకేవైనా చూపిస్తారనుకున్నాడు నరసింహం. ఈ ఉన్న వారం రోజుల్లో పట్టుమని పదినిమిషాలు వాళ్ళు తన దగ్గర కూచుని మాట్లాడనే లేదు. ఎవరినో పరాయివాణ్ణి చూసినట్లే మసలారు. అవును, వాళ్ళస్థాయి వేరు. వాళ్ళ శిక్షణ వేరు. వాళ్ళు మొదటి నుంచి నగరంలోనే ఉంటున్నారు. వాళ్ళ ప్రపంచం వేరు. తన చిన్నతనంలో ఇంటికెవరైనా చుట్టంవస్తే సంబరంగా ఉండేది. అదే పెదనాన్నో, మామయ్యో అయితే చెప్పాల్సిన పనిలేదు. పెదనాన్న స్కూల్ కబుర్లు, పాఠాలు, మార్కులు అన్నీ కనుక్కునేవాడు. మామయ్య అయితే తప్పక కాఫీ హోటలుకు తీసుకెళ్ళేవాడు ఉన్నన్నిరోజులూ. చుట్టాలు మళ్ళీ ఊరికెళ్ళిపోతున్నారంటే బెంగగా ఉండేది. ఇంకా నాలుగు రోజులుంటే ఎంత బాగుండును అనిపించేది. దీనికి బహుశా ఒక కారణం ఉండవచ్చు. చుట్టాలెవరైనా వస్తే ఆ నాలుగు రోజులూ పిల్లల్ని ఇంట్లో విసుక్కోవటం, కసురుకోవటం ఉండేదికాదు. వాళ్ళముందు తమకు మన్ననగా ఉండేది.

నరసింహం హైదరాబాదు వచ్చి వారం రోజులైంది. నగర జీవితం చూసి ప్రపంచం ఎంతో మారిపోయిందనుకొన్నాడు అతడు. ఏమిటో ఉరుకులు పరుగులు. విశ్రాంతిగా జీవిస్తున్నామని ఇక్కడ

ఎవరూ అనుకోవటం లేదు. ఎవరి ముఖం చూసినా దేనికోసమో ఎదురు చూస్తున్నట్లుంటుంది. తన తమ్ముడు రాష్ట్ర ప్రభుత్వంలో ఏదో పెద్ద ఉద్యోగమే చేస్తున్నాడు. కారు వచ్చి తీసుకెళుతుంది. మళ్ళీ కారులోనే ఇంటికి వస్తాడు. కారు మాత్రం ఇంట్లో ఉండదు. వాడి బిడ్డలకు పెళ్ళానికి అదో బెంగ కారూ, డ్రైవరూ ఎప్పుడూ ఇంట్లోనే ఉండే హోదా అయితే ఎంత బాగుంటుంది! పిల్లలూ తల్లీ కార్ల ఖరీదును, ఏ కారైతే బాగుంటుంది అనే విషయాన్ని ఈ వారం రోజుల్లో నాలుగైదు సార్లు తర్కించడం విన్నాడు. పిల్లలు ఏదో కబురు పట్టుకువస్తారు. దాంతో తల్లి ఉద్వేగంగా మాట్లాడేస్తుంది. టివీ, టివీ అని తెగమోజు పడతారు. మొదటి రెండు రోజుల్లోనే తనకు విసుగు పుట్టింది. ఇంటిల్లిపాది ధ్యాస మాత్రం దానిమీదే.

ఆదోని నుంచి చచ్చి చెడి వచ్చాడు తాను. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ఆ రోజున ఆరు గంటలు ఆలస్యంగా వచ్చింది. పాపం ఏమాటే కామాటే అనాలి. మరదలు వెంటనే అన్నం వండి పెట్టింది, కాని, నాలుగు రోజుల నుంచి ఏదో అదనపు భారం మోస్తున్నట్లు ఆ కవళికలు చెపుతున్నట్లనిపిస్తుంది తనకు. ఆధునికమైన అన్ని సౌకర్యాలు, గ్యాసుపొయ్యి,పంపునీళ్ళు, ఫ్రిజిడీర్, బట్టలుతికే యంత్రం, పనిమనిషి ఇన్ని ఉన్నా ఒక్కమనిషి నగరం వాళ్ళకు భారమవుతాడా? అదీ ఎంతగానో కావలసినవాడు! తన చిన్నప్పటి విషయాలు గుర్తు వచ్చాయి నరసింహానికి. అమ్మకు ఇలాంటి సౌకర్యాలేవీ ఉండేవి కావు. ఆరు నిలువుల లోతునుంచి నీళ్ళు తోడుకోవలసి వచ్చేది అయినా, చుట్టాలను పక్కాలను ఎంతగానో ఆప్యాయంగా చూసేది అమ్మ. ఎంత అసౌకర్యమైనా చిరునవ్వుతో సహించేది. బహుశా ఇప్పటి కుటుంబ మర్యాదలు, ఏర్పాట్లు మార్పుకు గురి అయినాయనిపిస్తుంది. చిన్న పిల్లవాడి నుంచీ పెద్దవాళ్ళవరకు తమ పరిధులు, స్వేచ్ఛలు నియతంగా కాపాడుకోవాలనే కోరిక పెరిగిపోయింది. అందువల్ల అవతలి వ్యక్తి

అదనపు సొద. ఖారం. తన పిల్లలు, తమ్ముడి పిల్లలూ ఒకరినొకరు చూసుకుని ఏ పదేళ్ళు కావస్తున్నదో. నాలుగేళ్ళ కిందట తాను పిల్లల తల్లినిపోగొట్టుకొన్నప్పుడైనా తమ్ముడి నుంచి పెద్ద అండ ఏమీ తనకు లభించలేదు. ఇప్పటి పరిస్థితులలో అలా ఆశించటం కూడా తప్పేమో! పెద్ద పిల్లకు పెళ్ళి చేయాలని పదేళ్ళ నుంచి ప్రయత్నిస్తున్నా కూడి రావటం లేదు. తమ్ముడి పరపతి ఏమైనా సాయపడుతుందేమోనని వచ్చాడు తాను. అది ఏమీ సమకూరేట్లు లేదు. డబ్బు సాయం అసలు ఆలోచనలోకే తీసుకొని రావటం తప్పేమో ననిపిస్తున్నది. తమ్ముడికి ఇద్దరు మగపిల్లలు, వీళ్ళిద్దరికన్నా పెద్ద ఆడపిల్ల. కాలేజిలో చదువు తున్నది.

ఇద్దరు మగ పిల్లలను చూస్తే క్షణ క్షణం తన చిన్నతనం కళ్ళ ముందు కదులుతుంది. తనకూ, తమ్ముడికీ రెండేళ్ళవారకూడా లేదేమో! కవల పిల్లలలాగా ఉండేవాళ్ళు తాము. తన మీద ఒక కాలూ ఒక చేయి వేసి పడుకొంటే కాని నిద్రపట్టేది కాదు వాడికి. ఇంచుమించు స్కూలు ఫైనలు ప్యాసయ్యేవరకూ అంతే! వీధిలోకి వెళ్ళినా ఆటలకు వెళ్ళినా ఇద్దరూ కలిసి ఉండాల్సిందే. నిన్నరాత్రి వాళ్ళిద్దరూ ఒకరి పక్కన ఒకరు కూచొని ఏదో ఇంగ్లీషు పుస్తకం లోంచి కథ చెప్పుకుంటూ ఉంటే తనకు ముచ్చటేసింది. తమ చిన్నతనమే గుర్తు వచ్చింది.

బిర్లా మందిర్ చూపిస్తారత్రా నాకు అని అడిగాడు ఉండబట్ట లేక. తాను ఏ బస్సు ఎక్కాలో, ఎక్కడ దిగాలో చెప్పారు కాని, వస్తా మనలేదు. తన తమ్ముడితో ఏమని అడుగుతాడు చిన్నపిల్లాడిలా తనకు బిర్లామందిర్, గోలుకొండలో రామదాసు బందిఖానా చూపించమని! తక్కిన వింతలు విశేషాలపట్ల తనకు ఆసక్తి లేదు.

ఏదైనా సంబంధం గూర్చి కాస్త విచారించరా అని చూచాయగా మొన్న ఒకనాడు అంటే, లౌకిక జ్ఞానం గురించి ఒక చిన్న ఉపన్యాసం దంచాడు. ఆడపిల్లల్ని చదివించాలన్నాడు. ఇరవై దాటకుండానే పెళ్ళి

చేయాలన్నాడు. డబ్బు దాచుకోవాలన్నాడు నయం, ఇంకా దోచుకోవాలనలేదు.

ఏటవాలుగా మెట్లపైకి కొంచెం ఎత్తు ఎక్కేసరికే నడ్డి నొప్పి పెట్టి కళ్ళు తిరుగుతున్నట్లూ, పైత్యపు వికారం కలుగుతున్నట్లు అనిపిస్తున్నది.

కాని అక్కడి బొమ్మల దుకాణాలు, వింత వింత వస్తువులు, పువ్వులు, పళ్ళ దుకాణాలు, చిన్నలు, పెద్దలు రక రకాల వేష భూషణాలు చూస్తుంటే మనస్సుకేమిటో ఉత్సాహమనిపిస్తున్నది. కాని, ఇంతలోనే కళ్ళు చెమర్చాయి. తన జీవితంలో తన పిల్లలకు ఇలాటివేవీ తాను చూపించలేకపోయాడు. చిరుతిండ్లు కొనిపెట్టలేకపోయాడు. వాళ్ళు కళ్ళు విప్పార్చి ముఖం చేటంత చేసుకొనే ఒక మంచి బట్ట, బొమ్మ, కలం, పండు, కాయ ఏదీ ఇవ్వలేకపోయినాడు.

నరసింహం ముందుకు సాగుతుంటే ఆ పాలరాతి పనితనం, ఎక్కడికక్కడ అందమైన నగిషీలు, సౌకర్యాలు ఎంతో ఆకర్షించాయి. నెమ్మదిగా ఒక్కొక్క మెట్టు ఎక్కి ముందుకు ముందుకు వెళ్ళాడు. చివరకంటా వెళ్ళేసరికి ఎంతో ఆనందమనిపించింది. హైదరాబాదు నగరమంతా అక్కడి నుంచి కనబడుతోంది. పెద్ద పెద్ద రోడ్లు ఇరుకు సందుల్లాగా; కార్లూ, బళ్లూ, ఆటోలు బొమ్మల్లాగా కనపడుతున్నాయి.

అక్కడ అందరికీ తీర్థంతోపాటు తిరు చూర్ణం ఇచ్చేట్లుంది. ఆ బొట్టు పెట్టుకొంటూ ఉంటే ఏమిటో ఆనందమనిపించింది.

కాసేపు అక్కడ కూచుందామనిపించింది. జంట వయసు పిల్లలు చేయీ చేయీ కలిపి, బుజం బుజం రాచుకుంటూ విరగపడు తున్నారు. కొత్తగా పెళ్ళయిన దంపతులు కావచ్చు వాళ్ళు.

"ఏమండీ, మీపేరు నరసింహం కదూ?"

పూర్తి బట్టతల, కింది వరస పళ్ళలో మూడు ఖాళీ, అలసిపోయిన కళ్ళు, ఒంటికి చిన్నప్పటి పాంటూ, షర్టులాగా నిండుగాలేని దుస్తులు.

ఇంత మహానగరంలో తననుకూడా గుర్తించే ఒక ప్రాణి ఉండటం విశేషమే. ఎంతో ఆప్యాయతతో, ఆనందంతో తన పక్కనే కూలబడి పోయినాడు. ఏదో లాటరీ టిక్కెట్టు ఫలించినంత సంబరంగా ఉంది ఆ పలకరించిన వ్యక్తికి. తన దగ్గరగా వచ్చిన ఆ వ్యక్తిని-

"అవును. మీ రెవరో గుర్తురావడం లేదు."

"హారినీ - చిలకలూరిపేట."

"అయినా సరే. అందడంలేదు."

"ఓరి నీ దుంపతెగ. ఒకరోజున మనకు చచ్చే పోట్లాట వచ్చింది కదరా! నీ తమ్ముడు నీకు అడ్డంవచ్చి నన్ను కొరికాడు. ఏంలేదు! చిన్నప్పుడు నువ్వు నంగిగా మాట్లాడేవాడివి. అందుకని నిన్ను వెక్కిరించాను. మీ తమ్ముడు నీమీద ఈగవాలనిచ్చేవాడు కాడు. ముక్కుశోణాలు బిగబట్టి ఉక్కురోషం చూపేవాడు. కళ్ళు ఎర్రబడి ఉత్తినే కన్నీళ్ళు కార్చేవాడు. నేను వెంకటాచలపతిని. ఓ రోజు చెడుగుడు ఆడుతుంటే నా కళ్ళనిండా దుమ్ముపోశావు. గవర్నమెంటాస్పిటల్ మంత్రసాని కొడుకుని." నరసింహానికి స్కూలు రోజులు గుర్తువచ్చాయి.

ఆ రోజు తమ్ముడు తనకోసం ఎన్ని దెబ్బలు తిన్నది గుర్తు వచ్చింది. తర్వాత తన పిల్లలు, వాళ్ళ ఉద్యోగాలు, తన అతి గతీ ఎన్నో చెప్పాడు వేంకటాచలపతి. అన్యమనస్కంగా వింటూవున్నా వేంకటాచలపతిలో చిన్ననాటి తన తమ్ముడే కనపడుతున్నాడు నరసింహానికి. మరీ చీకటిపడితే ఇల్లు చేరటం కష్టమని వేంకటాచలపతి సాయంతో సరైన బస్సు ఎక్కాడు నరసింహం. ఇంటికివచ్చేసరికి హాలులో తమ్ముడి పిల్లలు ఒకరిమీద ఒకరు పడుకుని బొమ్మల పుస్తకాలు చూస్తున్నారు! కృష్ణుడింకా ఇంటికి రాలేదా అని అడిగాడు నరసింహం, అక్కడే టీ.వి. చూస్తున్న మరదలిని. లేవనూలేదు, మంచి నీళ్ళు కావాలా అని అడగనూ లేదు ఆమె. *

(అసలు నిజం - 1989)